


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

శనివారం 9 ఆగష్టు 2025 పేజీలు 8


## డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్



**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్:** జిల్లా కేంద్రంలోని దౌదర్ పల్లి సమీపంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను మౌలిక సదుపాయాలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ స్థానిక సంస్థల కలెక్టర్ నర్సింగ్ రావు పరిశీలించడం జరిగినది. ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో కలిసి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి ఏ మూలిక సదుపాయాలు కరెంటు నీటి సదుపాయాలు సంబంధించిన వాటిని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా నుండి ఎదురుచూస్తున్న పేద ప్రజలు సొంతింటి కల త్వరలోనే నెరవేరబోతుంది. ఈ నెలాఖరులో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి చే గత లో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను డిప్పు ద్వారా లబ్ధి పొందిన అర్హులైన లబ్ధిదారులకు అన్ని మౌలిక సదుపాయాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు ఎలాంటి ఏర్పాటుచేసి త్వరలోనే వారు గృహప్రవేశం చేసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి , మంత్రి సహకారంతో కొన్ని మౌలిక సదుపాయాలను కరెంటు, తాగునీటి సౌకర్యము అలాంటి ఇబ్బంది లేకుండా అన్ని హంగులతో సరికొత్త డబల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల అన్ని మౌలిక సదుపాయాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు త్వరలో నే అన్ని రంగాల ప్రభుత్వ అధికారులకు త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు. త్వరలోనే మంత్రి చేతుల మీదుగా డిప్ ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులకు గృహప్రవేశం చేసే విధంగా అన్ని సౌకర్యాలతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మాణం చేసి అర్హులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, జిల్లాస్థాయి అన్ని శాఖల అధికారులు, మాజీ కౌన్సిలర్ మురళి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం

**- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షులు, కాంగ్రెస్ నేత ఎన్ పి.వెంకటేశ్**



**మహబూబ్ నగర్, మేజర్ న్యూస్:** 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకునే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ నేత ఎన్పీ.వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ లు బీసీలను మోసం చేసే పార్టీలు అని ఆరోపించారు. గతంలో హడావిడిగా ఒక్కనెలలోనే 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి ఢిల్లీకి పంపినా ఎందుకు చేయడం లేదని బీజేపీ నాయకులకు ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్ పై ఉన్న ప్రేమ బడుగులపై లేదా అని అన్నారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఢిల్లీలో జరిగిన ధర్నాకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం నుంచి తరలివెళ్లినట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తామని అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బీసీలందరూ ఏకమై ధర్నాకు వెళ్లడం జరిగిందన్నారు. బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఢిల్లీలో జరిగిన ధర్నాకు ఇండియా కూటమి ఎంపీలు పాల్గొని మద్దతు తెలిపినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకుమార్ గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా కొరత ఏర్పడకుండా మండలాల వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

- అవసరానికి మించి యూరియాను విక్రయిస్తే చర్యలు తప్పవు...
- ఫర్టిలైజర్ షాపులు. పిఏసిఎస్ సెంటర్లు స్టాక్ రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలీ.
- జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి




**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** జిల్లాలో యూరియా కొరత ఏర్పడకుండా మండలాల వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, స్టాక్ పూర్తిగా అయిపోకముందే ఉన్నతాధికారులకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్ తో కలిసి అన్ని మండలాల ఎంఏవోలు, ఏఈఓ లతో వెబ్ ఎక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత ఏర్పడకుండా మండలాల వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. స్టాక్ పూర్తిగా అయిపోకముందే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. రైతులకు అవసరమైనంత మాత్రమే యూరియా బస్తాలు విక్రయించాలని, అవసరానికి మించి అదనంగా యూరియా బస్తాలు విక్రయిస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని సూచించారు. కాబట్టి వ్యవసాయ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి అన్ని ఫర్టిలైజర్ దుకాణాలు, పిఎసిఎస్ లలో సేల్ రిజిస్టర్ లను తనిఖీ చేయాలన్నారు. ఈ విషయంలో చాలా స్ట్రిక్ట్ గా పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ఒక ఎకరానికి రెండు బస్తాలు మాత్రమే విక్రయించాలని, ఒకవేళ ఎవరైనా రైతులకు అదనంగా కావాలంటే మళ్ళీ 15 రోజుల తర్వాత వచ్చి తీసుకోవడానికి అవకాశం ఉంటుందని సూచించారు. రైతులకు యూరియా విక్రయించేటప్పుడు పట్టాదార్ పాస్ బుక్ సేకరించాలన్నారు. ఇష్టం వచ్చినట్లుగా యూరియా బస్తాలను విక్రయించడానికి వీల్లేదని సూచించాలన్నారు. వ్యవసాయేతర పనుల్లో యూరియాను దుర్వినియోగం చేసే అవకాశం ఉంటుందని ఈ విషయంలో జాగ్రత్త పడాలని ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్ దుకాణాలు, పిఎసిఎస్ లలో తనిఖీలు చేస్తూ ఉండాలని, స్టాక్ బోర్డులను, రిజిస్టర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్, మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, సాంకేతిక సిబ్బంది, పాల్గొన్నారు.

## వైభవంగా కురుమూర్తి స్వామి పవిత్ర ఉత్సవాలు



**చిన్నచింతకుంట మేజర్ న్యూస్ :** మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ కురుమూర్తి స్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని పవిత్ర ఉత్సవాలును వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగానే ఉదయాన్నే స్వామివారికి 108 అంశాలతో పంచామృత ద్వార పాలకులకు ఆల్వార్లకు అభిషేకం చేశారు.స్వామి వారికి పవిత్ర మాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం యాగశాల మండపంలో పూర్ణాహుతి హోమం చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి పవిత్ర ఉత్సవాలు శాస్త్రంగా నిర్వహించారు. పవిత్ర మాలను బత్తుల బాలరాజు స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జి గోవర్ధన్ రెడ్డి, ఆలయ అర్చకులు వెంకటయ్య,సత్యనారాయణ, అనంత విజయ్, శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు భాస్కరాచారి,నాగరాజు,బాదం వెంకటేశ్వర్లు,కమలాకర్,భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ వరలక్ష్మి దేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి



**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్:** జిల్లా కేంద్రంలోని వేదనగర్ నందు శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శ్రావణమాసం శుక్రవారం శ్రీ వరలక్ష్మి దేవి వ్రతం సందర్భంగా వరలక్ష్మి దేవి పూజా కార్యక్రమం ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించరు. అమ్మవారి ఆశీస్సులతో గద్వాల్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. ఎమ్మెల్యే సతీమణి కి పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయురాలు శాలువా కప్పి తాంబూలం ఇచ్చి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణంలో చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శనను ఎమ్మెల్యే సతీమణి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ డైరెక్టర్స్ రాధా రెడ్డి, మధుమతి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడ మండల కేంద్రంలో తెలంగాణ రాబిన్ హుడ్ పాలమూరు ముద్దుబిడ్డ పండుగ సాయన్న జయంతి మహోత్సవ కార్యక్రమం



**ధన్వాడ మేజర్ న్యూస్ :** ధన్వాడ మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర నీరటి నర్సిములు నాయుడు ముదిరాజ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు %ఐ% ధన్వాడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్ హుడ్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పండుగ సాయన్న ముదిరాజ్ 165 వ జయంతి మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నీరటి నర్సిములు నాయుడు ముదిరాజ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు %ఐ% ధన్వాడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ పండుగ సాయన్న బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు పోరాటం చేసి బానిస సంఖ్యలను తెంచి వారి జీవితాలలో వెలుగులు నింపాడని అదేవిధంగా దొరలపై పెత్తందారులపై పోరాటం చేసి పేదలకు అండగా ఉన్నాడని తెలిపారు అదేవిధంగా ఆయన ఆశయ సాధనలో ప్రయాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీరటి రామచంద్రయ్య మార్కెట్ కమిటీ డైరెక్టర్, జట్రం గోవర్ధన్ గౌడ్ మాజీ ఎంపిటిసి, సంద బాల నరసింహులు ఉపాధ్యక్షులు, మాణిక్యాల శివరాములు, సంద బాలరాజు, ఆనంద్, శ్రీహరి, శ్రీనివాసులు, రాజు, రాజశేఖర్ రెడ్డి, రామాంజనేయులు, లక్ష్మన్న, బోడ సత్తయ్య, బోయ రవికుమార్, వెంకటయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఐ జే యు అండగా ఉంటుంది: మధు గౌడ్.



**శ్రీరంగాపూర్ మేజర్ న్యూస్ :** శుక్రవారం వనపర్తి జిల్లా శ్రీ రంగాపురం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన వనపర్తి నియోజకవర్గ కార్యవర్గ సమావేశానికి వారు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ జిల్లా అధ్యక్షుడు మాధవరావు నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్ కుమార్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల అభివృద్ధి కోసమే తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అనే యూనియన్ పుట్టింది. నియోజకవర్గంలో జర్నలిస్టులు అందరు కలిసి మెలిసి యూనియన్ బలోపేతం చేయడంతో పాటు వారికి కావాల్సిన హక్కులను సాధించుకోవాలన్నారు. అర్ధరాత్రి డబ్బుల కోసం వెళ్లే బ్యాచ్ వెంబడి వెళ్లకుండా ఫీల్డ్ వర్క్ చేసి నిజ నిజాలను రాయాలన్నారు. కులాలకు మతాలకు యూనియన్ పని చేయదు జర్నలిస్టుల అభివృద్ధి కోసం పని చేయడం జరుగుతుందన్నారు.వచ్చే నెల మొదటి వారంలో జర్నలిస్టులకు శ్రీరంగపూర్ రంగనాయక స్వామి ఆలయంలో శిక్షణ శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ తరగతులను ప్రతి జర్నలిస్టు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్, రాష్ట్ర అవుట్ సైడ్ సభ్యులు శ్రీనివాస్ రావు, వనపర్తి జిల్లా అధ్యక్షులు డి మాధవరావు,జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా హెల్త్ కో కన్వీనర్ నిరుగంటి వెంకటేష్ గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి నరేష్ గౌడ్, ఈసీ నెంబర్ ఎం రంగస్వామి నాయుడు, జిల్లా కోశాధికారి మన్యం, నియోజకవర్గం అధ్యక్షుడు విజయ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలరాజు, నియోజకవర్గ ఉపాధ్యక్షులు శివసాగర్, పరశురాముడు, శ్రీరంగాపురం ప్రెస్ క్లబ్ సభ్యులు వేణుగోపాల్, బాలరాజు, శివసాగర్,కిట్టు, హరీష్ గౌడ్, నారాయణ,బి శ్రీనివాసులు, నరేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగితే కానీ స్పందించరా..?



**మాగనూర్ మేజర్ న్యూస్ :** మండలంలోని తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలలకు అనుసంధానంగా ఆవరణలో నిర్మించిన మెట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గత కొన్ని ఏళ్ల కిందట మెట్లు అసంపూర్తిగా నిర్మించి వదిలేయగా ఐరన్ రాడ్లు తేలి, పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో మండల వ్యాప్తంగా ఉన్న ఆయా గ్రామాల ప్రజలు,రైతులు ఇరు కార్యాలయాలకు పలు సమస్యల నిమిత్తం విచ్చేస్తుంటారు. దీంతో మెట్లు ఏ క్షణంలో కూలిపోతాయనని ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా మధ్యాహ్నం భోజన సమయంలో అధికారులు కార్యాలయం పైకప్పున భోజనం చేయడానికి వెళ్తుంటారు. అలా వెళ్లి కాలు కదిపిన సందర్భంలో పెచ్చులు ఊడి పడటంతో భయాందోళనకు గురయైన సంఘటనలు ఎన్నో జరిగాయి. సంబంధిత అధికారులు ప్రతిరోజు కార్యాలయాలకు వస్తుంటారు కానీ చూసి చూడనట్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే గాని అధికారులు పట్టించుకోరా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పూర్తిగా శిథిలమైన మెట్లను ధ్వంసం చేసి వాటి స్థానంలో నూతన మెట్లు నిర్మించాలని వారు కోరుతున్నారు.

## శక్తి పీఠంలో ఘనంగా వరలక్ష్మి వ్రతం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** నారాయణపేట శక్తి పీఠంలో శుక్రవారం శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానంలో అత్యంత వైభవంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. శక్తి పీఠం వ్యవస్థాపకులు స్వామి శాంతానంద పురోహిత్ పర్యవేక్షణలో వ్రత కార్యక్రమం జరిగింది.వరలక్ష్మి వ్రతాన్ని కృష్ణ యజుర్వేద స్మార్త పండితులు బ్రహ్మశ్రీ ఉట్కూర్ విభావసు పురోహిత్ చేతుల మీదుగా వేద మంత్రాలతో వరలక్ష్మి పూజ అత్యంత వైభవంగా నిర్వహించి భక్తులకు అమ్మవారి ఆశీస్సులు అందించారు.అనంతరం వరలక్ష్మి పూజకు విచ్చేసిన మహిళా భక్తులందరికీ అమ్మవారి అన్నప్రసాధం అందజేశారు.

## బిజెపి ఎమ్మెల్యే రమణారెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన నందునామాజీ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** ఇద్దరు ముఖ్యమంత్రులను ఓడించిన డబుల్ షూటర్ కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే వెంకట రమ ణారెడ్డి ని శు క్రవారం నారాయ ణపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్,జిల్లా బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందునామాజీ మ ర్యాద పూర్వకంగా కలిశా రు.ఒక కేసు విషయంలో కామారెడ్డికి వెళ్లిన నందునా మాజీ ఎమ్మెల్యే వెంకట రమ ణారెడ్డి నివాసానికి వెళ్లి కలు సుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి ఉత్సవాలు.



**శీరంగాపూర్ మేజర్ న్యూస్ :** పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఘనంగా జయంతి ఉత్సాహాలు జరిగాయి. అదేవిధంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించడం జరిగింది. కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల ముదిరాజులు బడుగు బలహీన వర్గాలకు బానిసత్వం నుండి పెత్తందారి వ్యవస్థ నుండి విముక్తి చేయడానికి ప్రజలందరూ స్వేచ్ఛ సమానత్వం మహిళాశాంతి కర్త రైతు సంక్షేమ కోసం కులాల మతాల మధ్య ఐక్యత కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంటూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## ఎస్పి కార్యాలయంలో బ్రహ్మకుమారీ ల రక్షాబంధన్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** రాఖి పండగ సందర్భంగా శుక్రవారం రోజు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ కు బ్రహ్మకుమారీ సిస్టర్స్ రాఖీలు కట్టి, స్వీట్స్ పంచి శుభాకాం క్షలు తెలిపారు. సందర్భంగా ఎస్పీ వారికి ధన్యవాదాలు తెలిపి, జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డ లు తమ అన్నదమ్ములకు అనురాగంతో చేతికి రక్షాబం ధనాన్ని కట్టడం గొప్ప సంద ర్భం అని దేశవ్యాప్తంగా జరు పుకునే రక్షాబంధన్ పండగ సోదరా భావానికి ప్రతిక అని తెలిపారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి బ్రహ్మకుమారి సిస్టర్ రాఖీలు కట్టి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

## నేను నీకు...! రక్ష నీవు నాకు రక్ష..!



**మల్దకల్ మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని శుక్రవారం అక్షయ రెడ్డి గ్రూప్ ఆఫ్ స్కూల్ ఆధ్వర్యంలో న్యూ ట్రాయి నీటి మోడల్ హైస్కూల్లో చిన్నారులతో ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ సభాస్తిన్ మాట్లాడుతూ రాఖీ కట్టే ఆచారం మొగల్ రాజుల కాలంలో స్త్రీల రక్షణ కోసం రాజ్య పుత్రుడు చేసిన ఏర్పాటు ని కొందరు అంటారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్చార్జి ఆస్మా, ప్రైమరీ ఇంచార్జ్ సుభాశిర, ఉపాధ్యాయులు సుప్రిత, ప్రమీల, లక్ష్మి, విజయలక్ష్మి, ప్రభావతి, లావణ్య, శంకర్ నాయుడు, ప్రభాకర్, పి ఈ టి వెంకట రాములు విద్యార్థిని, విద్యార్థులు తదితరు పాల్గొన్నారు.

## వైభవంగా వరలక్ష్మి పూజలు



**కోయిలకొండ మేజర్ న్యూస్:** మండలంలో ఉన్న అం కీళ్ళ గ్రామపంచాయతీలో ఉన్నా శ్రీరామాలయంలో గ్రామస్తులు కలిసి వరలక్ష్మీ వ్రతం పూజలు ఘనంగా నిర్వహించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంపత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా నైవేద్యం సమర్పించారని తెలిపారు. శ్రీరామాలయం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. శ్రీ వరలక్ష్మి దేవత ఆశీర్వాదం వల్ల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకోవడం జరిగిందని తెలియజేశారు.

## ఇంటింటి పైన తిరంగా పతాకాన్ని ఎగురవేయాలి



**గోపాలపేట మేజర్ న్యూస్ :** బ్రిటిష్ ప్రభుత్వానికి దీటుగా పోరాడిన మాన్ బావులను స్మరించుకొని వారి త్యాగాలను గుర్తు చేస్తూ 13వ తేదీ నుండి ఆగస్టు 15వ తేదీ నాడు ప్రతి ఇంటి పైన తిరంగా వర్ణ పతాకాన్ని ఎగురవేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్ రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు గోపాలపేట మండల కేంద్రంలో బిజెపి విభజన గాయాల స్మృతి దినం ఘర్ తిరంగా తిరంగా యాత్రలపై మండల స్థాయి సమావేశం గోపాల్పేట రేవల్లి మండల అధ్యక్షులు తిరుపతిరెడ్డి బాలనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు దేశం కోసం విభజన గాయాల స్మృతి ఎంతోమంది ప్రాణ త్యాగాలకు బ్రిటిష్ ప్రభుత్వానికి దీటుగా పోరాడినట్లు గుర్తు చేశారు గోపాల్పేట రేవల్లి మండలాల ఇన్చార్జిలు కదిరే మధు ప్రవీణ్ కుమార్ జిల్లా అధికార ప్రతినిధి సాగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణ మండల ప్రధాన కార్యదర్శి శివ బూత్ అధ్యక్షులు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు.



**కల్వకుర్తి మేజర్ న్యూస్:** కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీ శ్రీ లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ కల్వ మనోహర్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున నుండే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, పట్టణంలోని పలు దేవాలయాల్లో భక్తులతో సందడి నెలకొంది, భక్తిశ్రద్ధలతో భక్తులు వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు ఉన్నారు.

## చిరుత పులి సంచారం

**- చిరుత పులి జాడలే నిర్ధారిస్తున్న అటవీశాఖ అధికారులు**
**- భయాందోళనకు గురవుతున్న గ్రామస్తులు**





**ధరూర్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామ సమీపంలో రెండు రోజులుగా(గురువారం, శుక్రవారం) వ్యవధిలో గుర్తు తెలియని జంతువు దాడిలో ఆవు దూడ, కోడెదూడ మృతి చెందడంతో గ్రామస్తులలో ఆందోళన మొదలైంది. మొదట గుర్తు తెలియని జంతువు హైనా అయిండొచ్చని అందరు అనుమానాలు వ్యక్తం చేశారు. శుక్రవారం మరో మారు గుర్తు తెలియని జంతువు దాడి లో కోడె దూడ మృతి చెందడంతో అటవీశాఖ అధికారులు శుక్రవారం కొత్తపాలెంకు చేరుకున్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కొన్ని చోట్ల జాడలు కనపడటంతో చిరుతవే అని ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

### రేపు శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయంలో గంప జాతర



**మల్దకల్ మేజర్ న్యూస్:** ఆదిశిలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పవిత్ర శ్రావణ మాస శుక్రవారం సందర్భంగా శనివారం గంప జాతర జరుగుతుందని ఆలయ ఈవో సత్య చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం దేవాలయంలో శ్రీ స్వామి వారి కళ్యాణం జరుగుతుందని, సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో పల్లకి సేవలో దేవరగట్టు దగ్గరకు వెళ్లి పూజల అనంతరం దశమి కట్టవరకు మంగళ వాయిద్యాలతో స్వామివారి ఊరేగింపు, గంప జాతర జరుగుతుందని ఆయన తెలిపారు.

## అడ్డాకులలో ఘనంగా వరలక్ష్మీ వ్రత వేడుకలు



**అడ్డాకుల,మేజర్ న్యూస్:** అడ్డాకుల మండల కేంద్రంలోని శ్రీ శివాంజనేయ షిరిడి సాయి దేవాలయంలో శుక్రవారం పూజారి మఠం రాజేశ్వర స్వామి ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రత వేడుకలను నిర్వహించారు. కుంకుమార్చన నిర్వహించి అమ్మవారి కథను విని మొక్కులు తీర్చుకున్నారు ఈ సందర్భంగా మహిళలు కుటుంబ సభ్యులు ఆరోగ్యవంతంగా ఉండాలని, మంచిగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఘనంగా తెలంగాణ రాబిన్ హుడ్ జయంతి వేడుకలు



**గండీడ్ మేజర్ న్యూస్:** తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న జయంతి వేడుకలను గండీడ్ మండల కేంద్రంలో పాటు వెన్నచేడ్, పగిడ్యాల,కప్లాపూర్ గ్రామాలలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బోయిని గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ నిజాం రాజ్యంలో తిరుగుబాటు చేసి భూస్వాములను,దొరలను ఎదిరించి పేదల ఆకలి తీర్చిన గొప్ప వ్యక్తి పండుగ సాయన్న అని తెలిపారు. ఆయన చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఏ.వి.రాములు, బంటు నర్సప్ప,గిరమోని శ్రీనివాసులు, గిరమోని అంజిలయ్య,బంటు సాయిలు,కేశవులు,శంకరయ్య, గండీడ్ మండలం అంబేద్కర్ సంఘం అధ్యక్షులు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేను నీకు రక్ష..! నీవు నాకు రక్ష...!



**ధరూర్ మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి కాన్సెప్ట్ స్కూల్ నందు చిన్నారులతో ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ రాఖీ కట్టే ఆచారం మొగల్ రాజుల కాలంలో స్త్రీల రక్షణ కోసం రాజపుత్రుడు చేసిన ఏర్పాటనీ కొందరు అంటారు. చిత్తోడ్ మహారాణి కరుణావతి. తన కోటను గుజరాత్ నవాబ్ అయిన బహదూర్ష ముట్టడించగా తనను రక్షించమంటూ ఢిల్లీ చక్రవర్తి హుమాయు మాదిశాకు రక్షాబంధన్నిపంపి తమను రక్షించమని ప్రార్థించింది. అతడు ప్రార్ధనను మన్నించి ఆమెను తన సోదరిగా భావించి బహదూర్షాను తరిమి వేశాడు. మన పాఠశాలలో ఈ చిన్నారులు జరుపుకుంటున్న రక్షాబంధన్ కూడా ఒకరికొకరు సోదరసోదరీ భావంతో కలిసి మెలిసి ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ చిన్నారులకు మరియు అధ్యాపక బృందానికి విద్యార్థులు తల్లిదండ్రులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మరియు అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వర శివలింగం, బొడ్రాయి మహోత్సవంలో పాల్గొన్న సంకపురం రాముడు





**ఐజ మేజర్ న్యూస్ :** శ్రీ శ్రీ శ్రీ ఉమా మహేశ్వర శివలింగం, ధ్వజస్తంభం, నవగ్రహ, వాల్మీకి విగ్రహ, బొడ్రాయి, ప్రతిష్ట మహోత్సవం లో పాల్గొన్న జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మండలం వేణి సోంపురం గ్రామం లో గ్రామ పెద్దలు ఆహ్వానం మేరకు శ్రీ శ్రీ శ్రీ ఉమా మహేశ్వర శివలింగం ప్రతిష్ట,ధ్వజస్తంభం ప్రతిష్ట,నవగ్రహ ప్రతిష్ట వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ బొడ్రాయి ప్రతిష్ట లా మహోత్సవం లో భాగంగా గ్రామానికి వచ్చిన అయిజ మండల సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సంకాపురం రాముడు గ్రామస్తులు, నాయకులు , కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించారు.అనంతరం దేవాలయ పూజారులు పూర్ణకుంభంతో ఆహ్వానించి ఆశీర్వచనలు అందించారు.ఈ సందర్భంగా సంకాపురం రాముడు మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా భక్తిశ్రద్ధలతో శ్రీ పరమేశ్వర దివ్య ఉమ మహేశ్వర శివలింగ, నవగ్రహ ప్రతిష్ట వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవాన్ని జరుపుకోవడమే కాక దేవాలయాలను గుడి నిర్మాణాన్ని పూర్తి చేసుకొని అత్యంత వైభవంగా నిర్వహించుకోవటం ఆనందకరమన్నారు. గ్రామ దేవుని విగ్రహాల ప్రతిష్టాపన వలన గ్రామంలో ఐక్యత,శాంతి సౌభాగ్యాలకు నిలయంగా ఉంటుందన్నారు.ఆ శివుని ఆశీస్సులతో గ్రామ ప్రజలతోపాటు నియోజకవర్గ ప్రజలకు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు ఇవ్వాలని కోరుకుంటున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులా..?

**- కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను అడ్డుకోవడంలో అధికారులు విఫలం.**
**- ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నిస్తాం.**
**- ఎన్.హెచ్.పి.ఎస్. గట్టు మండల అధ్యక్షుడు బలరాం నాయుడు.**



గద్వాల టౌన్ మేజర్ న్యూస్: గట్టు మండల కేంద్రంలో అక్రమ నిర్మాణ, అన్యాయాలపై ప్రశ్నించినందుకు అక్రమ కేసులు పెట్టడం సమంజసం కాదని, ప్రజల పక్షాన ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నిస్తామని దీంతో గట్టు గ్రామ పంచాయతీ ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు కట్టడంలో ఎమ్మెల్యే అనుచరుడి భాగోతం బహిర్గతమైందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి గట్టు మండల అధ్యక్షుడు బలరాం నాయుడు శుక్రవారం సమితి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురై అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, కబ్జాదారుడికి అధికారులు మరియు నాయకులు అండగా ఉండడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఎమ్మెల్యే అనుచరుడు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేయవద్దు అని అన్యాయాన్ని ఎదిరించినందుకు తమపై అక్రమంగా కేసులు పెడుతున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎక్కడ అన్యాయం జరిగినా నడిగడ్డ హక్కుల పోరాట సమితి ప్రశ్నిస్తుందని, ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు పెట్టడం వారి మూర?త్వానికే నిదర్శనం అన్నారు. గట్టు గ్రామపంచాయితీ స్థలం ఆక్రమణకు గురైందని, పంచాయతీ స్థలాన్ని రక్షించాలని కోర్టు అట్టి నిర్మాణాన్ని నిలుపుదల చేసినప్పటికీ కబ్జాదారులు చేస్తున్న తప్పిదాలను గమనించకుండా అధికారులు అక్రమ కేసులు నమోదు చేయడం సరైనది కాదని, ఎక్కడ అన్యాయం జరిగినా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు వెంకట్రాములు,మండల నాయకులు శివప్ప, హనుమంతు, ఆరగిద్ధ నర్సింహులు, వీరన్న, గట్టు వాసు, బలిగేర బత్తలయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బీసీల విషయంలో గల్లీ రేవంత్ రెడ్డి ఒక మాట ఢిల్లీ నాయకుడు ఇంకో మాట



**ఐజ మేజర్ న్యూస్ :** అలంపూర్ నియోజకవర్గ ఐజ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు విద్యా, ఉద్యోగ, రాజకీయ, ప్రభుత్వ కాంట్రాక్టర్లకు ఇస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ప్రకటించి ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చడం దుర్మార్గమని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఇస్తామని చెప్పలేదు కదా ? అని ప్రశ్నించారు. బీసీ సాబ్ ప్లాన్, తెస్తా రూపాయి ఖర్చు పెడితే అందులో 42% బీసీలకు వెళ్ళేటట్టు చట్టబద్ధత తీసుకొస్తామని రేవంత్ రెడ్డి చెప్పడం మోసం నయవంచన అని అన్నారు. రేవంత్ రెడ్డి చేతిలో ఉన్న బీసీ సబ్ ప్లాన్ ఏమైంది? సంవత్సరానికి బీసీలకు 20 వేల కోట్ల బడ్జెట్ ఏమైంది? రెండు బడ్జెట్లో కలిపి కూడా 20వేల కోట్లు పెట్టలే. మరి ఐదేళ్లలో బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ పెడతాను అన్నది ఏమైంది? రాష్ట్రంలో ప్రభుత్వ కాంట్రాక్టర్లకు 42 శాతం బీసీ రిజర్వేషన్ ను ఎక్కడైనా కల్పించారా? ఆర్డినెన్స్, జీవో ద్వారా రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసినా, కాంగ్రెస్ పాలకులు వచ్చే నెల 5, 6,7 తేదీల్లో ఢిల్లీలో హైడ్రామాకు తెరలేపారని, చివరకు ఉత్త చేతులతోనే రాష్ట్రానికి తిరిగే రావడం సిగ్గుచేటు అని అన్నారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదు. మాకు బీసీ కన్న బిహారే ముఖ్యమని ఖర్గే రాలేదు మీ ధర్నాలో నిజాయితీ లేదని, బీసీలకు 42శాతం కోటా అమలు చేస్తారనే మాటలపై నమ్మకం రాహుల్ గాంధీ, ఖర్గే లతో పాటు, తెలంగాణ ప్రజలకు కూడా లేదని సుస్పష్టం అయ్యింది. మేం గుజరాత్ లోఅడగలేదు, ఉత్తర్ ప్రదేశ్ లో అడగలేదు, మహారాష్ట్రలో అడగలేదు తెలంగాణలోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అడుగుతున్నాం" అని రేవంత్ రెడ్డి ప్రసంగిస్తే , అదే సమయంలో రాహుల్ గాంధీ గారూ. ఈ పోరాటం తెలంగాణ కోసం మాత్రమే కాదు, యావత్ దేశం కోసం చేస్తున్న పోరాటం అని ట్వీట్ చేస్తరు. ఒకే రోజు, ఒకే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు, రాహుల్ గాంధీ చెప్పిన మాటలకే పొంతన లేదు, బీసీలకు 42శాతం రిజర్వేషన్ మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో రెండు నాల్కల దోరణి చూస్తేనే అర్థమవుతున్నది అని అన్నారు. చివరాఖరుకు బీసీలకు కేవలం రాజకీయ రిజర్వేషన్లు కట్టబెట్టి చేతులు దులుపుకోవాలన్న ముందస్తు వ్యూహంతోనే కాంగ్రెస్ డ్రామాలాడుతున్నదని మండిపడ్డారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ కదన రంగంలోకి దూకిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేదాకా కాంగ్రెస్ సర్కారును వదలిపెట్టే ప్రసక్తే లేదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో తొత్తినోనీ దొడ్డి మాజీ సర్పంచ్ శివకుమార్, తెలుగు నాగేంద్ర, మహేష్ గౌడ్, రాజు ఉన్నారు.

## క్యూబా ప్రజలకు అండగా ఉందాం



**గద్వాల టౌన్ మేజర్ న్యూస్:** అమెరికన్ నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు కార్మిక వర్గం అండగా నిలబడాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి.వి. నరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రజల నుండి క్యూబా ప్రజల సహాయర్థం స్వచ్ఛంద విరాళాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....65 సంవత్సరాలుగా అమెరికా నిర్బంధాన్ని తట్టుకుంటూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు కార్మిక వర్గం అండగా నిలబడాలని కోరారు. ఆహారం, ఇంధనం, ముడి సరుకులు తదితర అనేక రకాలుగా క్యూబాకు అందకుండా ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిందని అన్నారు. అంతేకాకుండా క్యూబా పై వ్యాపార ఆంక్షలు, ఆర్థిక ఆంక్షలు, పెట్టుబడి ఆంక్షలు విధించి ఇతర దేశాల నుండి కనీసం సహాయం పొందేందుకు కూడా వీలులేని పరిస్థితిని అమెరికా కల్పించిందని విమర్శించారు. అమెరికా విధిస్తున్న ఆంక్షలను ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి చేసిన 31 తీర్మానాలను సైతం అమెరికన్ గా తిరస్కరించిందని విమర్శించారు. క్యూబా వ్యతిరేక శక్తులకు మిలియన్ డాలర్లను ఖర్చు చేస్తూ క్యూబాను అస్థిరపరిచేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. సామ్రాజ్యవాద అమెరికా విధానాల వలన, ఆర్థిక నిర్బంధాల వల్ల క్యూబా లక్షల కోట్లు నష్టపోయిందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేర్ నరసింహ, వీవోఏ ల మండల అధ్యక్షుడు తిమ్మప్ప, గౌరవ అధ్యక్షులు వెంకట్రామయ్యా, ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ కార్మికుల సంఘం పట్టణ అధ్యక్షుడు రఘు, మురళి పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించడమే లక్ష్యం.



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** పరులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ ఠాకూర్ బాలాజీ తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ లోని 1,4వ వార్డులలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైనా ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేదల బతుకులు మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు బృంగి ఆనంద్ కుమార్, భూపతి రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ లు బాలు నాయక్, గోరటి శ్రీనివాసులు, హన్మనాయక్, నాయకులు అలీ భాయ్, హరికిషన్ నాయక్నారాయణ నాయక్, శివ, శేఖర్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, నవీన్ఆరిఫ్, మహేష్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ లో వెండి పతకం



**చిన్న చింతకుంట మేజర్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్రస్తాయి అథ్లెటిక్స్ క్రీడాలో సత్తాచాటి వెండి పతకాన్ని సాధించిన చిన్న చింతకుంట మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామ క్రీడాకారిణి టి. సుచిత్ర కు అభినందనలు వెల్లువెత్తాయి ఈ నెల ఆగష్టు 7వ తేదీన జనగాం జిల్లాలోని ధర్మకాంచ మినీ స్టేడియంలో తెలంగాణ రాష్ట్రస్తాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ తెలంగాణ రాష్ట్ర జావెలిన్ త్రో %డ% కిడ్స్ అథ్లెటిక్స్ మీట్ - 2025 పోటీల్లో సబ్ జూనియర్స్ గర్ల్స్ విభాగంలో స్టాండింగ్ బ్రాడ్ జంప్ లో చక్కటి ప్రతిభ కనబర్చి రెండవ స్థానం విజేతగా నిలిచి వెండి పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ సారంగపాణి చేతుల మీదుగా సుచిత్రకు మెడల్ తో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు గ్రామీణ స్థాయి నుండి క్రీడాలో రాణిస్తు అథ్లెటిక్స్ క్రీడాలో చక్కటి ప్రతిభను కనబరిచి జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటి రాణిస్తున్న అల్లీపూర్ గ్రామ క్రీడాకారిణి టీ. సుచిత్రను వనపర్తి జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ నందిమల్ల శ్రీకాంత్, అథ్లెటిక్స్ కోచ్ నవీన్, తల్లితండ్రులు, గ్రామస్తులు, యువకులు, సుచిత్రకు శుభాకాంక్షలు తెలిపారు.

## ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



**నవాబుపేట్ మేజర్ న్యూస్:** తల్లిపాల వారోత్సవాలు ఈనెల 1వ,తేదీ నుంచి శుక్రవారంతో ముగిశాయి. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో జయరామ్ నాయక్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని,ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా అన్నారు.ఎటువంటి పరిస్థితుల్లో అయినా తల్లి బిడ్డకు పాలు పట్టవచ్చుని,బిడ్డ ఆరునెలల వయస్సు వరకు తల్లిపాలు తాగించాలన్నారు.రెండేళ్ల వరకు అదనపు ఆహారంతో తల్లిపాలు ఇవ్వాలన్నారు.తల్లిపాలతో బిడ్డలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక మెడికల్ ఆఫీసర్ డా.శ్రీజ,హెల్త్ సూపర్వైజర్ శివలీల,ఆర్ఐ రామాంజనేయులు,ఐసీడిఎస్ సూపర్వైజర్ రాజరాజేశ్వరి,మెడికల్ సిబ్బంది శ్రీనివాస్,రాములు మండల పరిధిలోని అన్ని గ్రామాలు అంగన్వాడి టీచర్లు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఘర్షణలో వ్యక్తి మృతి

**నవాబుపేట్ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని భూమి విషయంపై తండ్రి,తనయుల మధ్య ఘర్షణ జరిగింది.ఈ ఘర్షణలో తండ్రి ప్రాణాలు కోల్పోయిన ఘటన కామారంలో చోటు చేసుకుంది.ఎస్సై విక్రమ్ తెలిపిన కథనం మేరకు మండల పరిధిలోని కామారం గ్రామానికి చెందిన చిలుకల కృష్ణయ్య(50),2015సం.లో భార్యను చంపి జైలు శిక్ష అనుభవించి,ఇటీవల కాలంలో బయటకు రావడం జరిగింది.తరచు భూమి విషయంపై కృష్ణయ్య కుమారుడు వెంకటేష్ తో గొడవ పడుతుండేవాడు శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరి మధ్య ఘర్షణ పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.ఈ సంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి,కృష్ణయ్యకు తలకు బలమైన గాయమై అపస్మారపు స్థితిలోకి వెళ్లి చనిపోయినట్లు,కృష్ణయ్య అన్న చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు,ఈ సంఘటనలో వెంకటేష్ ని రిమాండ్ కి తరలించినట్లు,ఎస్సై విక్రమ్ తెలిపారు.

## శ్రీ సాయి స్కూల్ లో ఘనంగా రక్షాబంధన్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్ లో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నేను నీకు రక్ష ,నీవు నాకు రక్ష మనమి ద్దరం ఈ దేశానికి రక్ష అంటూ రాఖీలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలప్ప ఉపాధ్యాయులు అమీనా, హెచ్. నర్సిము లు,సురేందర్ గౌడ్,సునీల్ రెడ్డి,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి సన్నిధిలో - డాక్టర్ అశ్విని నవదీప్ రక్తదానం.








**మహబూబ్నగర్ మేజర్ న్యూస్ :** మహబూబ్ నగర్ కు చెందిన డాక్టర్ అశ్విని నవదీప్ శుక్రవారం తిరుమల శ్రీవారి సన్నిధిలో రక్తదానం చేశారు. పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త లయన్ అశ్విని చంద్రశేఖర్ తనయుడు , తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అశ్విని నవదీప్ రక్తదానం అవశ్యకతను గుర్తించి ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు వివిధ ప్రాంతాల్లో ఇదివరకు 10 సార్లు రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. 11వ సారి తిరుమల శ్రీవారి సన్నిధిలో రక్తదానం చేయాలనే తలంపుతో డాక్టర్ అశ్విని నవదీప్ తిరుమల లోని అశ్విని హాస్పిటల్ (టిటిడి రక్త నిధి కేంద్రం )లో రక్తదానం చేశారు. తిరుమల శ్రీవారి సన్నిధిలో రక్తదానం చేసిన డాక్టర్ అశ్విని నవదీప్ ను టి టి డి రక్త నిధి కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గౌరి ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. అంతే కాకుండా రక్తదానం చేసిన డాక్టర్ అశ్విని నవదీప్ కు శ్రీవారి ప్రత్యేక దర్శనం అవకాశం కలిగించారు. అనంతరం రక్తదాత డాక్టర్ అశ్విని నవదీప్ మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం ఉన్నతమైనది అన్నారు. రక్త దాతలు ఆపదలో ఉన్న వారికి ప్రాణ దాతలతో సమానమని అన్నారు.రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదని అన్నారు. తిరుమల శ్రీవారి సన్నిధిలో రక్తదానం చేయడం ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు డాక్టర్ నవదీప్ అన్నారు. రక్తదానం ప్రాణ దానంతో సమానమనే విషయాన్ని యువత గుర్తించి రక్తదానం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా తిరుమల శ్రీవారి సన్నిధిలో రక్తదానం చేసిన డాక్టర్ అశ్విని నవదీప్ ను పలువురు అభినందించారు.

## పేట - కొడంగల్ ఎత్తిపోతల ద్వార మాత్రమే సాగునీరు సాధ్యం

**- జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్.నర్సింహా**



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** నారాయణ పేట జిల్లా రైతులకు సాగునీరు మరియు త్రాగునీరు నీరు కేవలం మక్తల్ - నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా మాత్రమే సాధ్యం అని జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్.నర్సింహా తెలిపారు.మాజీ ఎమ్మెల్యే లు పాలమూర్ - రంగారెడ్డి ద్వారా సాగునీరు ఇస్తాం అని చెప్పడం చాలా అన్యాయం అని అన్నారు.కృష్ణ జలాలు శ్రీశైలం చేరక ముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 33 వేల క్యూసెక్కుల నీటిని తరిస్తాం అని లక్షకు పైగా క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారని తెలిపారు.శ్రీశైలం ప్రాజెక్ట్ నిండిన తర్వాత ఎక్కువై నీళ్లు సముద్రంలో కలిసే వరద జలాలతో మాత్రమే పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులు నింపుకోవాలి.శ్రీశైలం చేరక ముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష క్యూసెక్కుల నీటిని తరలించుక పోతే శ్రీశైలం ప్రాజెక్టు కూడా నీళ్లు లేని పరిస్థితులు చూస్తున్నామని తెలిపారు.పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కు నీళ్లు ఎక్కడ నుంచి వస్తాయో చెప్పాలని కోరారు.పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీళ్లు నికర జలాలు కావున నీళ్ళు నింపుకోవడానికి రిజర్వాయర్లు లేక జూరాల ప్రాజెక్టు కేటాయించిన 20 టీఎంసీల నీళ్లలో 7.10 టీఎంసీ నీళ్లు కిందికి వదిలేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే లు తెలుసుకోవాలని అన్నారు.రైతులకు న్యాయం చేయాలి కానీ స్వార్థం కోసం మోసం చేయవద్దు అని హితవు పలికారు.పేట - కొడంగల్ ఎత్తిపోతల ద్వార అయిన పాలమూరు - రంగారెడ్డి ద్వారానైనా సాగునీరు ఇవ్వాలంటే రైతులు భూమి ఇవ్వాల్సిందే అనే నిజం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు.రైతులకు సరి అయిన నష్టపరిహారం కోసం అందరం కలిసి గాంధేయ మార్గంలో ప్రయత్నం చేసి మేలు చేద్దాం అని అన్నారు.ఇప్పుడు ఈ ఎత్తిపోతల పూర్తి కాకపోతే జన్మజన్మలో జిల్లా రైతులకు సాగునీరు రాదు అని అన్నారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటంలో పాలకులు విఫలం



**పాలమూరు మేజర్ న్యూస్:** ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందారని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఎన్ కురుమూర్తి విమర్శించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ ) జిల్లావ్యాప్తంగా చేపట్టిన జీపు యాత్ర ముగింపు సభ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా కాషాయకరణకు పాల్పడుతుందన్నారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణకు వంత పాడుతుందన్నారు. ఫలితంగా పేద, బడుగు బలహీన విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యా సదుపాయాలను కల్పించే బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతులు మెరుగుపరచాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. **విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భరత్ :-** ఈనెల 4 నుండి ప్రారంభమైన జీపు యాత్ర 16 మండలాల్లో 80 సంక్షేమ హాస్టల్స్,గురుకులాలు, కేజీబీవీ, జూనియర్ కళాశాలలో 30వేల మంది విద్యార్థులను కలిసిందన్నారు. ప్రభుత్వాలు మారిన సంక్షేమ వసతి గృహాల్లో సరిపడా వసతులు కల్పించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సొంత భవనాలు లేవని, సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించకపోవడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సంఘం చేపట్టిన జీపు యాత్రలో వెలుగులోకి వచ్చిన సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు త్వరలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, శ్రీనాథ్, నందు, జిల్లా కమిటీ సభ్యులు జ్ఞాపిక, సాయి, నాయకులు నవ్య,బన్నీ, మణికంఠ,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఊరూరా వరలక్ష్మి వ్రతాలు



**మూసాపేట మేజర్ న్యూస్:** వరలక్ష్మి వ్రతాలను పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రమైన మూసాపేటతో పాటు వేముల, కొమిరెడ్డిపల్లి, దాసరపల్లి, జానంపేట, పోల్కంపల్లి, చక్రాపూర్, మమ్ముదూషన్ పల్లి , నిజాలాపూర్ ఊరూరా ప్రజలు భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేపట్టారు. అలాగే గ్రామాల్లో కొందరు ఇండ్లలో వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరుపుకొని తమ తమ కుటుంబాలను చల్లగా చూడాలని వరలక్ష్మి తల్లిని వేడుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**అడ్డాకుల, మేజర్ న్యూస్:** అడ్డాకుల స్నేహ చికెన్ పరిశ్రమకు ఎదురుగా ఉన్న 44 వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి కొత్తకోట వైపు నుండి అడ్డాకుల వైపు నడుచుకుంటూ వస్తున్న వ్యక్తి ని అదే వైపు నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఎల్ అండ్ టీ సిబ్బంది అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు తెల్ల చెక్స్ షర్ట్, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించాడని, వయసు 45 సంవత్సరాలు ఉండవచ్చని మృతదేహం మహబూబ్నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చిలో గలదని ఆచూకీ తెలిసినవారు 8712659353 నంబర్ కు ఫోన్ చేయాలని, వివరాలకు అడ్డాకుల పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## రైతులకు అవసరమైనంత మాత్రమే యూరియా బస్తాలను విక్రయించాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి రూరల్ మేజర్ న్యూస్ :** వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజనగరంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న ఎరువులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిఎసిఎస్ లో ఎరువుల విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్ ను తనిఖీ చేశారు. ఒక్కో రైతుకు ఎంత మేర యూరియా బస్తాలను అమ్ముతున్నారనే విషయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సిన దానికన్నా అదనంగా యూరియా బస్తాలను విక్రయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో రైతులకు అవసరమైనంత మాత్రమే యూరియా బస్తాలను విక్రయించాలని, అవసరానికి మించి అమ్మితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కొరత ఏర్పడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని దాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారులు దృష్టిసాదించి ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ఎకరానికి ఒకటి లేదా రెండు బస్తాలు మాత్రమే ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఎరువుల నిల్వకు సంబంధించిన బోర్డును పరిశీలించారు. ఎప్పటికప్పుడు బోర్డులో ఎరువుల స్టాక్ వివరాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి, సింగిల్ విండో చైర్మన్ రఘు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ - వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు



**వనపర్తి టౌన్ మేజర్ న్యూస్ :** "నేను నీకు రక్ష – నీవు నాకు రక్ష, మనమిద్దరం ఈ దేశానికి రక్ష" అన్న భావనతో దేశవ్యాప్తంగా జరుపుకునే రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో పలు విద్యాలయాల్లో రక్షాబంధన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ సోదర–సోదరీ బంధాన్ని బలపరుస్తుందని, స్త్రీల పట్ల సోదరి భావంతో ప్రవర్తించాల్సిన అవసరాన్ని ఈ పండుగ గుర్తు చేస్తుందని తెలిపారు. కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో, ప్రేమతో జీవించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, స్త్రీలపై దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, ఇది సోదర భావనలోపమే కారణమని ఆయన పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మనకు రక్షణ కవచంలా ఉన్నాయని, వాటిని మరువకుండా పాటించాల్సిన బాధ్యత మనందరిదని అన్నారు. కార్యక్రమంలో సంతోష్, వెంకటేష్, నితిన్, మహబూబ్, భరత్, సిద్దు తదితర ఎబివిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను మోసం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ : సంకపురం శేఖర్



**ఐజ మేజర్ న్యూస్ :** కాకా కాలేకర్ కమిషన్ నుంచి కామారెడ్డి డిక్లరేషన్ వరకు కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తూనే ఉంది. బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఆఫీస్ కో సెక్రెటరీ సంకాపురం శేఖర్ , జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం తొతినోని దొడ్డి గ్రామంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఆఫీస్ కో సెక్రెటరీ సంకాపురం శేఖర్ బీసీ కుల సంఘాల నాయకులతో సమావేశమై కాంగ్రెస్ పార్టీ కామ రెడ్డి బీసీ డిక్లరేషన్ అమల్లో చేస్తున్న జాప్యం మరియు మోసం గురించి చర్చించారు. కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పనతో పాటు ఎన్నో అబద్ధపు మోసపూరిత అమలు గాని హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని పీఠమెక్కి ఇప్పుడు అమలు చేయకుండా ఢిల్లీకి వెళ్లి డ్రామాలు చేస్తుంది అని అన్నారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం .ఒకవైపు జై సంవిధాన్ అంటూ మరోవైపు నై సంవిధాన్ అనే విధంగా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తావున్నారు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ను ఆర్టికల్ 243(%ం% )6 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి లేకపోతే బీసీలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని మట్టు పెడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల నాయకులు ముదిరాజ్ రామకృష్ణ ఎద్దుల రాముడు వీరేష్ బోయ తిమ్మప్ప మరియు పార్టీ నాయకులు వాణిజ్య సెల్ కన్వీనర్ ప్రతాప్ గౌడ్ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మేకల ఆంజనేయులు బిజెపి సీనియర్ నాయకులు చెన్న బసవ పాటిల్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపు పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు

**- జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్**



**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపు పనుల్లో స్పష్టమైన పురోగతి సాధించేందుకు క్షేత్ర స్థాయిలో పనిచేయాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఆదేశించారు. ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పై మున్సిపల్ ఎంపీడీవోలు, కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా సాధించిన ప్రగతిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు మంజూరైన 7 వేల ఇందిరమ్మ గృహాల్లో ఇప్పటివరకు 1,078 బేస్మెంట్ దశకు,3,850 మార్క్ అవుట్ దశకు చేరుకున్నాయని తెలిపారు. గతంతో పోలిస్తే ఈసారి మంచి పురోగతి సాధించినప్పటికీ, అదే వేగాన్ని కొనసాగించి మరింత మెరుగైన ఫలితాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో కొంతమంది అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నప్పటికీ, మరికొందరు పనుల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. ఇలాంటి ధోరణి సహించేది లేదని హెచ్చరిస్తూ, పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇళ్లు అందించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఆదేశించారు. అన్ని మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో లబ్ధిదారుల వివరాలను త్వరితగతిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పోర్టల్ నందు ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓలకు ఇసుక బుకింగ్ కోసం లాగిన్ ఐడీలు అందజేస్తామని, లబ్ధిదారులకు ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సింగ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస రావు, హౌసింగ్ డీ.ఈ. కాశీనాథ్, అన్ని మండలాల ఎంపిడిఒలు,మున్సిపల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తున్న బిజెపి నాయకులు



**మదనాపురం మేజర్ న్యూస్:** మదనాపురం మండలం నర్సింగాపూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ అధిష్టానం పిలుపుమేరకు పార్లమెంట్ కన్వీనర్ డోకూరు పవన్ కుమార్ రెడ్డి మరియు దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి ఆదేశానుసారం ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో జరుగుతున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి డోర్ టు డోర్ పర్యటించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులకు గ్రామ ప్రజలు మద్దతు పలకాలని కోరిన మండల భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, బీజేవైఎం నాయకులు బిట్లిరాజశేఖర్, మండల బిజెపి నాయకులు కొండా వెంకటేశ్వర్ల శెట్టి ,కావలి శివ, నితిన్ కుమార్ తదితర గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి : జిల్లా కలెక్టర్



**వనపర్తి రూరల్ మేజర్ న్యూస్ :** వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజనగరం సమీపంలో శుక్రవారం గొర్రెలు మేకల కోసం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టీకాల క్యాంపును జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి సందర్శించారు. ఈ సందర్భంగా గొర్రెలు మేకలకు టీకాలు వేయడాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గొర్రెలు, మేకలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు. ప్రస్తుతం నీలి నాలుక వ్యాధి సోకకుండా అన్ని గొర్రెలు మేకలకు బ్లూ టంగ్ వ్యాక్సిన్ ఇవ్వాలని చెప్పారు. గొర్రెలకు టీకాలు ఇచ్చే ముందు రోజు సంబంధిత రైతుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మొత్తం ఎన్ని టీకాలు పంపిణీ చేయడం జరిగిందని పశు సంవర్ధక శాఖ అధికారిని ప్రశ్నించగా, 3.39 లక్షలు టీకాలు రావడం జరిగిందని బదులిచ్చారు. అక్కడే ఉన్న రైతులు మాట్లాడుతూ గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలని కలెక్టర్ ను కోరగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అదేవిధంగా గొర్రె పిల్లలు శునకాల బారిన పడకుండా సంరక్షణగా జాలి పంపిణీ చేయాలని కలెక్టర్ ను కోరగా పరిశీలిస్థామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సంవర్ధక అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, పశుసంవర్ధక వైద్యులు, ఇతర అధికారులు, స్థానికులు కురుమూర్తి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని అన్ని గొర్రెలు. మేకలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. - జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి...



**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** జిల్లాలోని అన్ని గొర్రెలు, మేకలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని రాజనగరం సమీపంలో శుక్రవారం గొర్రెలు మేకల కోసం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టీకాల క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా గొర్రెలు మేకలకు టీకాలు వేయడాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గొర్రెలు, మేకలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు. ప్రస్తుతం నీలి నాలుక వ్యాధి సోకకుండా అన్ని గొర్రెలు మేకలకు బ్లూ టంగ్ వ్యాక్సిన్ ఇవ్వాలని చెప్పారు. గొర్రెలకు టీకాలు ఇచ్చే ముందు రోజు సంబంధిత రైతుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మొత్తం ఎన్ని టీకాలు పంపిణీ చేయడం జరిగిందని పశు సంవర్ధక శాఖ అధికారిని ప్రశ్నించగా, 3.39 లక్షలు టీకాలు రావడం జరిగిందని బదులిచ్చారు. అక్కడే ఉన్న రైతులు మాట్లాడుతూ గొర్రెలు మేకలకు నటల నివారణ మందులు పంపిణీ చేయాలని కలెక్టర్ ను కోరగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అదేవిధంగా గొర్రె పిల్లలు శునకాల బారిన పడకుండా సంరక్షణగా జాలి పంపిణీ చేయాలని కలెక్టర్ ను కోరగా పరిశీలిస్థామని చెప్పారు. జిల్లా పరిషత్ సంవర్ధక అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, పశుసంవర్ధక వైద్యులు, ఇతర అధికారులు, స్థానికులు కురుమూర్తి, గోపాల్, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఎస్.ఎ మ్యాథ్స్ ప్రమోషన్లలో ఎస్సీ మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు చేయాలి : గద్వాల కృష్ణమాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు.



**వనపర్తి టౌన్ మేజర్ న్యూస్ :** వనపర్తి జిల్లాలో ప్రస్తుతము ఎస్సే. మాథ్స్ ప్రమోషన్లలో ఎస్సీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. ప్రస్తుతము వనపర్తి డి.ఈ.ఓ కార్యాలయము ఇచ్చిన సమాచారం ప్రకారం సాంక్షన్ పోస్టులు ఎస్సే మాథ్స్ లో 24 ఉండగా ప్రస్తుతము వర్కింగ్ పోస్టులు 22,మహిళా కోటలో 8 రావలసి ఉండగా, ప్రస్తుతము %ా.ాా% మాథ్స్ వర్కింగ్ స్థానంలో నలుగురే మహిళలు ఉన్నారు. ప్రస్తుత ఎస్సే మ్యాథ్స్ ప్రమోషన్ లో అడక్కువేసి రీచ్ కావడానికి ఇంకా రెండు పోస్టులు ఇవ్వవలసి ఉంది, ఆ రెండు పోస్టులను కూడా జనరల్ గా ప్రకటించకుండా మహిళా అభ్యర్థులచే నింపాలి. కావున మహిళలకు రావలసిన 33% రిజర్వేషన్స్ ప్రకారము ఎస్సీ మహిళా ఉపాధ్యాయులకు నలుగురికి ప్రమోషన్లు కల్పించవలసిందిగా ఈరోజు డి.ఈ.వో ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఎం. ఈ.ఎఫ్ జిల్లా అధ్యక్షులు బోరెల్లి వెంకటయ్య మరియు ఎస్.వెంకట స్వామి బంకలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## బోధిని కళాశాలలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**ఐజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం కేంద్రంలో బోధిని జూనియర్ కళాశాలలో ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా రాఖీ పౌర్ణమి సంబరాలు జరుపుకున్నారు. శనివారం రోజున సెలవు దినం కావడం ద్వారా ఈరోజు కళాశాలలో ఉన్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు రాఖీ శుభాకాంక్షలు తెలుపుతూ ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటూ సోదరి సోదర భావంతో మెలగాలని విద్యార్థులకు రాఖీ పౌర్ణమి ప్రత్యేకతను తెలుపుతూ ఏ విధంగా అయితే అన్న చెల్లెలకు రక్షగా ఉంటాడు తమ్ముడు అక్కకు ఈ విధంగా రక్షగా ఉంటాడో అదే విధంగా భారతదేశం లో ఉన్నటువంటి ప్రజలందరూ కులమత రహితంగా ఉంటూ భారతదేశన్నీ మతోన్మాద శక్తుల నుండి రక్షించుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మండల బిజెపి అధ్యక్షులు బోయ నాగరాజు శాఖ ప్రచారకులు లోకేష్ రవీంద్ర నాథ్ రెడ్డి బోధని కళాశాల సిబ్బంది విద్యార్థి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల వల్ల జరిగే సమస్యలను నష్టాల గురించి వివరించిన స్పెషలాఫీసర్ షకీలా భాను



**ధరూర్ మేజర్ న్యూస్ :** మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ వారి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నివారించడం, బాల కార్మికులను నిర్మూలించడం మరియు వివిధ హింసల నుండి పిల్లలను రక్షించడం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ షకీలా భాను గారూ హాజరై మాట్లాడుతూ బాలలందరు శ్వేతాయుత వాతావరణం లో పెరగాలని, చిన్న వయస్సులో పెళ్ళిలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే సమస్యలు, నష్టాలు గురించి అవగాహన కల్పించారు, మరియు బాల కార్మిక వ్యవస్థ వలన పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని అందుకే పిల్లలను బడికి క్రమం తప్పకుండా హాజరు అయ్యేలా చేయాలని తల్లితండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఐసిపిఎస్ కౌన్సిలర్ సురేష్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గోమతి, ఉమెన్ హబ్ సిబ్బంది చిట్టెమ్మ, కమ్యూనిటీ సభ్యులు కృష్ణయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత షేక్ షమీ బిఆర్ఎస్ లో చేరిక



**ఊట్కూర్ మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో ముఖ్య నాయకుడిగా ఉన్న ఊట్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు, మాజీ యువజన అధ్యక్షుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు షేక్ షమీ, శుక్రవారం భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీకి షమీ ని స్వాగతించిన బిఆర్ఎస్ పార్టీ మక్తల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి, మాట్లాడుతూ షమీ చేరికతో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అంబేద్కర్ విగ్రహన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేయాలి



**మక్తల్ మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రుద్రసముద్రం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత భారతరత్న డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని మక్తల్ మండల తహసిల్దార్ కి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ... రుద్రసముద్రం గ్రామంలోని బస్ స్టాప్ చౌరస్తాలో గల భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గత అర్ధరాత్రి కరెంటు లేని సమయంలో కొంతమంది గుర్తు తెలియని దుండగులు చూపుడు వేలును, కళ్లద్దాలు, మొహం, తల మీది భాగాలను విరగొట్టి, ధ్వంసం చేశారని అన్నారు. గతంలో కూడా 2 సార్లు ఇదే మాదిరిగా అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జన సంఘం మక్తల్ అధ్యక్షులు పృథ్వీరాజ్, ఎమ్మార్పీఎస్ జీర్గల్ నగేష్ మాదిగ, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి చంద్రశేఖర్, కే ఎన్ పి ఎస్ విజయ్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ సలహాదారులు డిహెచ్జి పోలప్ప, అంబేద్కర్ యువజన సంఘం ఉప్పరపల్లి అధ్యక్షులు బాలకృష్ణయ్య, అంబేద్కర్ యువజన సంఘం రుద్రసముద్రం అధ్యక్షులు రాములు, రుద్ర సముద్రం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మారుతీ, నరసింహులు, జనార్ధన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల్లో డీజేలకు నిషేధం, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు: డి.ఎస్.పి లింగయ్య



**ఊట్కూర్ మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి సమీక్ష సమావేశంలో డీజే లపై నిషేధం విధిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల వినాయక మండపాల అధ్యక్షులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా డి.ఎస్.పి లింగయ్య మాట్లాడుతూ, కోర్టు ఆదేశాల ప్రకారం ఇకపై వినాయక ఉత్సవాల్లో డీజే లను పూర్తిగా నిషేధించినట్లు ప్రకటించారు. ఉత్సవాల్లో తక్కువ శబ్దం వచ్చే మినీ బాక్స్‌లను మాత్రమే వినియోగించాలన్నారు. శాంతియుతంగా, పవిత్రంగా ఉత్సవాలు జరపాలని సూచిస్తూ, నిబంధనలు అతిక్రమిస్తే డీజే పరికరాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గ్రామ పెద్దలు భాస్కర్, ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా వినాయక ఉత్సవాల్లో అసాంఘిక కార్యకలాపాలు పెరిగినట్లు పేర్కొన్నారు. తాగుడుతో పాటు, అసభ్య నృత్యాలు, గొడవలు చోటుచేసుకుంటున్నాయని, ఈ పరిస్థితిని మార్చి కుటుంబ సమేతంగా ఆనందంగా పండుగ జరిపే దిశగా పని చేయాలని తెలిపారు. పార్టీ లకతీతంగా గ్రామస్థుల సహకారంతో శోభాయాత్ర నిర్వహణ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. హిందూ సంఘాల నాయకులు భరత్, బాలాంజనేయులు మాట్లాడుతూ, చట్టాల పేరుతో ఉత్సవాల జోష్ తగ్గించకూడదని, తక్కువ శబ్దం వచ్చే బాక్స్‌లకు అనుమతి ఇవ్వాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. హిందూ సమాజం ఐక్యతతో పండుగలు జరపాలని, కులాలకూ, పార్టీలకూ అతీతంగా ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. పోలీస్ శాఖ స్నేహపూర్వకంగా సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో కోర్టు ఆదేశాలు, జీవో వివరాలపై సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో శెట్టి రమేష్, మోనప్ప, గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహేష్ రెడ్డి, బిఎస్పీ నాయకులు గౌతమ్, బీజేపీ నాయకులు రనవీర్, బిఆర్ఎస్ నాయకులు గంగాధర్, తారకృష్ణ, శివప్రసాద్ రెడ్డి, అనీల్, పోలీస్ శాఖ నుండి సిఐ రాంలాల్, ఎస్సై రమేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పండగ సాయన్న జయంతి వేడుకలు..



**కోస్గి మేజర్ న్యూస్:** తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న 165వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గం లోని కోస్గి పట్టణంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శివాజీ చౌక్ లో పండగ సాయన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఎస్ వేణుగోపాల్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్ ముదిరాజ్, పట్టణాధ్యక్షుడు వలుపటి అనంతయ్య ముదిరాజ్, మాట్లాడుతూ పాలమూరు మట్టిలో పుట్టిన ముదిరాజు ముద్దుబిడ్డ పండుగ సాయన్న సేవలు అమోఘమని,నిరుపేదలకు సాయన్న చేసిన సేవలను కొనియాడారు. ఆకలితో అలమటిస్తున్న పేద ప్రజల కడుపు నిపండానికి భూస్వాములతో పోరాటాలు చేసిన గొప్ప త్యాగదనుడని అన్నారు. పండుగ సాయన్న పాలమూరు జిల్లాతో పాటు తెలుగు రాష్ట్రాల లో ని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పండుగ సాయన్న సేవల్ని ఎప్పటికీ మరిచిపోలేమని వారు అన్నారు. నిజం నిరంకుశపాలను, భూస్వాముల పెతందారుల దొరల దోపిడీలను అరికట్టిన గొప్ప వీరుడనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు మాస్టర్ శ్రీనివాస్ ,నరేష్, బీడీల చంద్రశేఖర్, రాము, దస్తయ్య ,కొంద్రు అంజి, అజయ్, బెందూరి రాములు, నరసప్ప, బుగ్గప్ప, వేణు, మల్లేష్ ,చిన్నప్ప ,నాగప్ప, రాము, చింటూ, కోట గడ్డవెంకట్, మడుగు వెంకట్ హనుమంతు, వెంకట్, మల్లేష్, ఆంజనేయలు, రాములు,చెన్నప్ప,ఆశప్ప, శంకర్,పద్మ,లతోపాటు ముదిరాజ్ యువకులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు మండల పరిధిలోని అన్ని గ్రామాల ముదిరాజ్ సంఘం ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలు..



**కోస్గి మేజర్ న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి ఏనుముల తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పెద్దఎత్తున హాజరై కేక్ కట్ చేసి బాణసంచాలను కాల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల అభిమానాన్ని చురగొన్న తిరుపతి రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో కొడంగల్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధిలో తిరుపతి రెడ్డి కృషి ఎంతో ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయకుమార్,మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్షన్ రెడ్డి, అన్న కిష్టప్ప, నాగులపల్లి నరేందర్, నాగులపల్లి శ్రీనివాస్, భీమ్ రెడ్డి, హరికుమార్, బెజ్జు రాములు, దోమ రాజేశ్వర్ ,బాలేష్, తుడుం శ్రీనివాస్, మాస్టర్ శ్రీనివాస్, వేణుగోపాల్, ఇద్రిస్, అసిఫ్, భానునాయక్, చల్లా శ్రీరాములు, మహేందర్ గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, భోగారం ప్రభాకర్, బాలరాజు, మడుగు వెంకట్, హాజీ, ఎజాజ్, గండిట్ దేవేందర్, వార్ల బాలరాజు, నాగులపల్లి నర్సింహ, మహిపాల్ రెడ్డి, తదితరులున్నారు.

## వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



**మక్తల్ మేజర్ న్యూస్ :** పట్టణ కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రత కార్యక్రమము నిర్వహించారు. శ్రావణ మాస సందర్భంగా 30 మంది మహిళా మాతాజీలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత ఆచరణతో అమ్మవారిని ఆరాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రభుత్వ ఉపాధ్యాయులు వీణ హాజరై మాట్లాడుతూ... భగవంతుని అనుగ్రహము వలన మాత్రమే ఇలాంటి సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మనమంతా మన కుటుంబం మన గ్రామం రాష్ట్రం దేశం విశ్వ సంక్షేమాన్ని కోరుకునే విధంగా ఆ దేవుని ప్రార్థిస్తున్నామని అన్నారు. ప్రపంచ శాంతిని కోరే ఏకైక ధర్మ హిందూ ధర్మమని మన ధర్మానికి సంబంధించిన ఇతిహాస గ్రంథాలు రామాయణం మహాభారతం ప్రతి ఒక్కరు తెలుసుకొని తమ తర్వాతి తరానికి అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు రఘు ప్రసన్న భట్, కొండా విజయకుమార్, రవీందర్, మల్లినాథ్, పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు..



**ఊట్కూర్ మేజర్ న్యూస్:** తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న 165వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఊట్కూరు మండల కేంద్రంలోని పాతపేట వీధిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండగ సాయన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ముద్దం రాము ముదిరాజ్, సందాపురం రవి, మల్లెపల్లి అశోక్, మాట్లాడుతూ పాలమూరు మట్టిలో పుట్టిన ముదిరాజు ముద్దుబిడ్డ పండుగ సాయన్న సేవలు అమోఘమని,నిరుపేదలకు సాయన్న చేసిన సేవలను కొనియాడారు. నిజాం నిరంకుశపాలను, భూస్వాముల పెత్తందారుల దొరల దోపిడీలను అరికట్టిన గొప్ప వీరుడనీ అన్నారు. ఈ కార్యక్రమంలో బెస్త రామచందర్, మల్లేపల్లి తిరుపతి, నదులాపురం యాదయ్య, సందాపురం తిరుపతి, పుగ్గేలి నరసింహులు, వడ్ల బలరాం, ఆనంద్, శివమ్మెల ఉషప్ప, వసంత్ కుమార్, ముదిరాజ్ సంఘం ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**మక్తల్ మేజర్ న్యూస్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర నాయకులు వినయ్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సంఘటనలు కేవలం అందరిలో సోదరిమని అనే భావన లేకపోవడం వలనే స్త్రీలపై అత్యాచారాలు, మానభంగాలు అవుతున్నాయి. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను విదేశీయులు పాటిస్తున్నారు. మనం కూడా మన సంస్కృతి మరువరాదు ఇలాంటి వాటికి భారతదేశంలో చోటు చేసుకోకుండా ఉండాలంటే మన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ మంచిమర్గంలో, సోదర సోదరీ మనే భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షురాలు ఇందు, కార్యదర్శి కిషోర్, ఆనంద్, ఆకాష్, అభి, అనిల్, శ్రీధర్, నరేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహణ

**మహబూబ్ నగర్,మేజర్ న్యూస్:** ఆగస్టు 9 న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన బాలుర వసతి గృహం, బోయపల్లి రోడ్, మహబూబ్ నగర్ నందు ఉదయం 11.30 గంటలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన అన్ని ఆదివాసీ నాయకులు, మేధావులు, యువతి యువకులు , ఉద్యోగులు, రాజకీయ నాయకులు కార్యక్రమంలో పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన ఈ ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



**నవాబుపేట్ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో శుక్రవారం ప్రజాపోరాటవీరుడు,తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పండుగ సాయన్న పేద,బడుగు,బలహీనవర్గాల హక్కులు, అభ్యున్నతి కోసం భూస్వాములు, జమీందారులు, దొరలపై నిరంతర పోరాటం చేసి దొరలవద్ద ఉన్న సంపదను నిరుపేదలకు,బడుగు జీవులకు, పంచిపెట్టిన, బహుజన, ప్రజాపోరాటవీరుడు అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామంలోని తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**దేవరకద్ర మేజర్ న్యూస్ :** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండా గోవర్ధన్ రెడ్డి గారి తల్లి కొండా సత్యమ్మ మరణించడంతో నేడు కొండా సత్యమ్మ భౌతిక దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్ మధుసూదన్ రెడ్డి. అనంతరం దేవరకద్ర మండలం బస్వాయి పల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త శేఖర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భౌతిక దేహానికి నివాళు లర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్.. అనంతరం వారు మాట్లాడుతూ. ప్రతి అండగా ఉంటాను వారు తెలిపారు.

## వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**నవాబుపేట్ మేజర్ న్యూస్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు,అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దెలు,కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరూ నివాసం ఉండవద్దని,చెరువులు,కుంటలు,వాగులలోకి ఎవరూ వెళ్లొదని,సీజనల్ వ్యాధుల బారిన పడిన ప్రజలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా వరలక్ష్మి వ్రతం పూజ వేడుకలు



**కోడేరు, మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం లో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు అమ్మవారికి అభిషేకం చేసి సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించి మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక వరలక్ష్మి వ్రత వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.

## రక్షాబంధన్ కు ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలతోపాటు అన్ని ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ఇవ్వాలి



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ఆత్మీయతకు అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీక." నీవు నాకు రక్ష -నేను నీకు రక్ష మనమంతా ఈ దేశానికి, ఈ ధర్మానికి రక్ష" అంటూ ఒకరికొకరు అనుబంధాన్ని, ఆత్మీయతను పంచుకునే విశిష్టమైన పండుగ రాఖీ పౌర్ణమి. కాబట్టి ఇంతటి ప్రాముఖ్యత కలిగిన పండుగ సందర్భంగా విద్యాలయాలకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలకు సెలవు దినం ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్ ప్రభుత్వాన్ని కోరుతోందనీ విహెచ్ పి నాయకులు బాలస్వామి ఒక ప్రకటనలో ప్రభుత్వనీ డిమాండు చేశారు. కాబట్టి రక్త సంబంధానికి, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతిరూపమైన రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్ని గురుకులాలకు ప్రభుత్వం వెంటనే సెలవు దినం ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు.

## రైతులు మోతాదుకు మించి ఎరువులను వాడరాదు



**లింగాల ,మేజర్ న్యూస్:** రైతులు తమ భూమి పరిమాణానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు వాడాలని, మోతాదుకు మించి ఎరువులు వాడరాదని ఆయన హెచ్చరించారు. శుక్రవారం లింగాల మండల పరిధిలోని పిఎసిఎస్ ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్. యశ్వంతరావు, సహా ఏడీఏ ఎం. చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారు ఎరువుల అమ్మకాలు, నిల్వలు, లాజర్ మరియు ఇతర సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంతరావు మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలను తప్పనిసరిగా ఈ-పీవోఎస్ ద్వారా, బయోమెట్రిక్ విధానంలోనే జరిపించాలని స్పష్టం చేశారు. రైతులు తమ ఆధార్ ఆధారంగా కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇది అవకతవకలకు అవకాశాలు తగ్గించే ప్రక్రియగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.అధిక మోతాదులో ఎరువుల వాడకం వల్ల నేల నాణ్యత దిగజారుతుందని, ఫలితంగా దిగుబడులు ప్రభావితమవుతాయని వివరించారు. నిబంధనలను పాటించాలని రైతులకు సూచించారు. ఎరువుల సరఫరా, నిల్వలు, వ్యవహారాలపై సమగ్ర సమీక్ష అనంతరం, అధికారులు రైతులకు మార్గనిర్దేశం చేశారు. ఈ తనిఖీలు ఎరువుల సరఫరాలో పారదర్శకతను కలిగించడంతో పాటు, రైతులకు అవసరమైన సమాచారం అందించేందుకు తోడ్పడినట్లు అధికారులు వెల్లడించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో లింగాల మండల వ్యవసాయ అధికారి గుండూరు అనిల్, అచ్చంపేట మండల వ్యవసాయ అధికారి, కృష్ణయ్య బల్మూరు మండల వ్యవసాయ అధికారి నరేష్, పిఎసిఎస్ సీఈఓ పాండు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు రెండు పశువులు మృతి



**తెల్కపల్లి మేజర్ న్యూస్ :** తెలకపల్లిమండల పరిధిలోని గట్టురాయిపాకుల గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షం లో భాగంగా పిడుగు పడి రెండు పశువులు మరణించాయి, గ్రామానికి చెందిన రైతు మషన్న తన పొలంలో చెట్టుకు కట్టేసిన ఆవు, కోడె పిడుగుపాటుకు చనిపోయాయి, శుక్రవారం ఉదయం పొలం దగ్గరికి వెళ్లిన రైతుకు గడె%శీ% పశువులు చనిపోవడంతో బాధిత రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు, పశువుల విలువ రూపాయల లక్ష వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు, బాధిత రైతును అధికారులు ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## గౌరారంలో ఆవు మృతి



**తెలకపల్లి మేజర్ న్యూస్ :** తెలకపల్లిమండల పరిధిలోని గౌరారం గ్రామంలో గురువారం సాయంత్రం రైతు మహేష్ కు చెందిన ఆవు విద్యుత్ షాక్కు గురై చనిపోయి%శీ%ది, రైతు తన పొలంలో కట్టేసిన ఆవు గాలి, వర్షానికి బెదురుకొని తాడు తెంపుకొని దగ్గరలో గల ట్రాన్స్ఫారం వద్దకు వెళ్లి తీగె ను తగిలి ప్రమాదం గురించి చనిపోయింది, బాధిత రైతు మహేష్ సంఘటనపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు, ఆ వు విలువ రూపాయల 60 వేల పైగా ఉంటుంది అని తెలిపారు అయ్యో రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## భూభారతి అర్జీలను వేగంగా పరిష్కరించాలి...



**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** భూ భారతి రెవెన్యూ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ కీమ్యా నాయక్ ఆదేశించారు. శుక్రవారం పెబ్బేరు, శ్రీరంగపూర్ తహసీల్దార్ కార్యాలయాల్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగుల అటెండెన్స్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యాలయ సమయానికి ఆలస్యంగా వచ్చే ఉద్యోగులను వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 'భూభారతి' దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులందరూ నిర్ణీత సమయానికి కార్యాలయానికి హాజరు కావాలని, కార్యాలయ క్రమశిక్షణను పాటించాలని సూచించారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే, రికార్డు గదిలోని రికార్డులను సక్రమంగా, భద్రంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పెబ్బేరు లోని సత్యసాయి రైస్ మిల్లును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ రబీ 2024-25 సీజన్ కు సంబంధించి ఎఫ్ సి ఐ కి సమర్పించవలసిన సి ఎం ఆర్ బియ్యాన్ని వేగంగా అందించాలని మిల్లర్లను ఆదేశించారు. ప్రతిరోజు ఒక ఏసీకే ధాన్యాన్ని సమర్పించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

## కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాస వేడుకలు.



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ కన్యక పరమేశ్వరి దేవి దేవాలయంలో శుక్రవారం వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో శ్రావణమాస వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్ బాబు హాజరయ్యారు, ఈ సందర్భంగా ఊరేగింపుతో జై వాసవి మాత నినాదాలతో అమ్మవారికి సారె, చీర ఒడి బియ్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల రామకృష్ణ ప్రతి క్లబ్ కు చీరలు పంపించడం జరిగిందని తెలిపారు, ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్స్ బాదం ధనలక్ష్మి, రాఘవేందర్, సెక్రటరీ నీల స్రవంతి, కోటీశ్వర్, ట్రెజరర్స్ మచిపెద్ది కల్పన, రవి కుమార్, మండల ప్రెసిడెంట్ గంధం ప్రసాద్, టౌన్ ప్రెసిడెంట్ వాస శేఖర్, చిగుళ్ళ పల్లి శ్రీధర్, యన్మంగండ్ల రవి, కల్వ ఆంజనేయులు, యూత్ అధ్యక్షులు సంబు తరుణ్, మహిళా అధ్యక్షులు మౌనిక, భక్తులు తదితరులు ఉన్నారు.

## పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులుగా మేకల రాజేందర్.



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులుగా మేకల రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి భవన్ లో ఎన్నికల అధికారులు భావండ్ల వెంకటేష్, మేకల వెంకటేశం, భావాండ్ల శ్రీను, క్యామమల్లేష్, పున్న సురేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా మేకల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా మాకం రమేష్, కోశాధికారిగా గంజి ప్రసాద్ ను ఎన్నుకున్నట్లు తెలిపారు, పద్మశాలి సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని రాజేందర్ కోరారు, ఈ కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ మాజీ అధ్యక్షులు నాగుల వెంకటేశ్వర్లు, భావండ్ల మధు, ప్రస్తుత ఉత్సవ కమిటీ కన్వీనర్ గుజ్జరి శ్రీను, కో కన్వీనర్ మాకం నారాయణ, గంజి మురళి, ముత్యాలు, తదితరులు ఉన్నారు.

## ఉప్పల ట్రస్ట్ ఆర్థిక సాయం.



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కల్వకుర్తి మండల కేంద్రంలోని పోతనపల్లి శేఖర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తక్షణ సాయంగా 3వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు, బిఆర్ఎస్ కార్యకర్తలు పోతనపల్లి కృష్ణయ్య, బండి లక్ష్మయ్య నాగేంద్రం, మాధవరెడ్డి, మెంట వెంకటేష్, పోతరపల్లి పరుశురాములు, తుమ్మల జంగయ్య ,మల్లేష,సుధాకర్ తదితరులు ఉన్నారు.

## కరాటేలో శిక్షణతో భవితకు రక్షణ



**లింగాల, మేజర్ న్యూస్:** ఆత్మరక్షణ క్రీడైన కరాటే లో శిక్షణతో భవితకు రక్షణగా ఉంటుందని బిసి ఐక్య వేదిక పట్టణ అధ్యక్షులు రాజుల్ యాదవ్ అన్నారు. శుక్రవారం లింగాలలోని ఏకలవ్య విగ్రహం వద్ద 15 ఏళ్ల అనుభవంతో గత కొన్నేళ్ల నుండి అచ్చంపేట నియోజక వర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు కరాటే లో శిక్షణ ఇస్తున్న బ్లాక్ బెల్ట్ మాస్టారు ముఖేష్ నేతృత్వంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన నిహాన్ షోడోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీచే కరాటే, కిక్ బాక్సింగ్ తో పాటు జోడో రెగ్యులర్ శిక్షణ తరగతుల ప్రచార సామాగ్రిని విడుదల చేశారు.ఇప్పటికే కరాటేలో శిక్షణ పొందుతున్న చిన్నారుల కరాటే విన్యాసాల ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్యంగా బాలికలకు వివిధ అంశాల్లో ఎదురయ్యే ఘటనలపై ఆత్మరక్షణకై మెలుకువలు నెర్పిస్తారని అన్నారు. నిహాన్ షోడోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియాచే గుర్తింపు పొందిన ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ద్వారా కరాటేలో వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులు, పథకాలు,గుర్తింపు పత్రాలు అందజేయనున్నట్లు బ్లాక్ బెల్ట్ మాస్టర్ ముఖేష్ తెలిపారు. వివరాలకు 7780301534 నంబరుకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్టారు ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 2 ను రద్దు చేయాలి

**నాగర్ కర్నూల్ రూరల్ మేజర్ న్యూస్ :** ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లో నష్టం కలిగిస్తున్న జీవో నెంబర్ (02)రద్దు చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాధికారి ఏ రమేష్ కుమార్ కి అడక్వసి వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు శుక్రవారం జిల్లా విద్యాధికారి ఏ రమేష్ కుమార్ కి వినతి పత్రాన్ని అందజేశారు.

## శివకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలి



**కోడేరు, మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని వడ్డె వాడకు చెందిన వడ్డే శివకృష్ణ(24) శుక్రవారం ఉదయం కల్వకుర్తి హైవే రోడ్డు మీదగా బైక్ పై వెళుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో శివకృష్ణ అక్కడి కక్కడే మృతి చెందాడు. స్థానికులు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకవెళ్ళడంతో ఇట్టి విషయాన్ని కోడేరు గ్రామ%శీ%లో ఉన్న శివ కృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. సమాచారం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దూ రెడ్డి రఘువర్ధన్ రెడ్డి అక్కడికి చేరుకుని స్థానిక ఎస్సై తో మాట్లాడి సిసి ఫుటేజ్ ద్వారా గుర్తుతెలియని వాహనం ఏదో కనిపెట్టి శివకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఐ ని కోరారు. ఆయన వెంట గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం, ఆర్.కే రామ కృష్ణ, కొమిరె రాజు, లక్ష్మణ్, మల్లిఖార్జున్, ఆటోయూనియన్ నాయకులు వున్నారు.

## డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్పీకి వినతి.



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కల్వకుర్తి డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్యాం పవన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిఎస్పి సాయి రెడ్డి వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులలో ఇటీవల అనివార్య కారణాలవల్ల చోటు చేసుకుంటున్న సంఘటనల నేపథ్యంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఆస్తులపై దాడులు చేయడం జరుగుతున్నదని దీనిని నివారించాలని డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు డీఎస్పీకి వివరించారు. వైద్యులను మానసికంగా ఒత్తిడికి, భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి భారీగా మూల్యం చెల్లించే విధంగా ఒప్పించడం ఆనవాయితీగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటికి నివారించేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వెంకట్ రెడ్డి ని కోరారు, ఇలాంటి ఘటనలతో డాక్టర్ల మనోభావాలు దెబ్బతిని అత్యవసర సమయంలో వైద్యం చేసేందుకు వెనుకడుగు వేసే పరిస్థితి నెలకొందన్నారు. దీంతో సామాన్య ప్రజలకు సకాలంలో సరైన వైద్యం అందక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు, ప్రజాప్రతినిధులు, ప్రజలు గమనించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులైన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డీఎస్పీ ని కోరారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగార్జున, డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు



**కోడేరు, మేజర్ న్యూస్:** కాంగ్రెస్ ద్వారానే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతున్నాయని మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్ రావ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జనుంపల్లి, కొండ్రావుపల్లి గ్రామాలలో మొదటి విడతలో భాగంగా నిరుపేదలకు ఇండ్లు మంజురవడంతో మాజీ ఎంపీపీ కొత్త రామారావు మంజూరైన ఇండ్లకు భూమి పూజ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు కచ్చితంగా ఇందిరమ్మ యిండ్లు మంజూరు అవుతాయని ఎవరు అధైర్య పడవద్దు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రవణ్ కుమార్, ఇన్చార్జి ఎం పి ఓ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లయ్య, పోడేండ్ల సురేష్, ఆదిరాజు, చామంతి రాజు, మహిపాల్ రెడ్డి, నరసింహ, వేణు, కురుమయ్య, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులున్నారు.

## తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్.



**శ్రీరంగాపూర్ మేజర్ న్యూస్ :** శ్రీరంగాపూర్ మండలం తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తదనంతరం కార్యాలయానికి సంబంధించిన రిజిస్టర్లను రికార్డులను పరిశీలించడం జరిగింది. అధికారులు సమయపాల తప్పక పాటించాలని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## మృతికి కారకులైన దుర్మార్గులను శిక్షించాలి

**కోడేరు, మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని వడ్డేవాడ కు చెందిన శివకృష్ణ శుక్రవారం కల్వకుర్తి హైవే రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందడం చాలా బాధాకరమని కాంగ్రెస్ నాయకులు దూ రెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. సమాచారం తెలుసుకున్న ఆయన కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని శివకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలీసులతో మాట్లాడి శివకృష్ణ మృతికి గల కారకులైన దుండగులను సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించి శిక్షించాలని ఆయన పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో రామ్ లక్ష్మణ్, అశోక్, కురుమయ్య, రాజు ,ధర్మరాజు, తిరుపతి తదితరులు ఉన్నారు.

## నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ నరసింగరావు



**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్ :** నులిపురుగుల నిర్మూలన కోసం 1 నుండి 19 సంవత్సరం లోపు వారందరికీ ఈ నెల 11 న ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని జిల్లా అదనపు కలెక్టర్ నరసింగరావు అన్నారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11 వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంపై డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆయన మాట్లాడుతూ 1 నుండి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరికీ నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య ఆరోగ్యశాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యజమాన్యాలను ఆదేశించారు. పిల్లలలో నులిపురుగులు ఉండటం వలన వారిలో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి మందగించడం తదితర ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, వీటివల్ల చదువుపై ఏకాగ్రత కోల్పోతారని అన్నారు. సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం వల్ల పిల్లలలో ఈ సమస్యల నుండి చాలా వరకు మెరుగుదల కనిపించిందన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు ఇవ్వబడతాయని, బడి బయట పిల్లలకు కూడా ఈ కేంద్రాలలోనే మాత్రలు తప్పకుండా ఇప్పించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం,పాఠశాల, కళాశాలకు ఒక అంగన్వాడీ కార్యకర్త, ఆశా కార్యకర్త, ఏఎన్ఎం లను అనుసంధానం చేయాలని,జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరంలోపు (1,71,354) పిల్లలు ఉన్నారన్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల రీజనల్ కోఆర్డినేటర్లను కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలన్నారు. మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని, ఎలాంటి అపోహలు ఉండకూడదన్నారు. మండల స్థాయిలో సంబంధిత విభాగాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ఇన్చార్జిలను భాగస్వాములను చేయాలన్నారు. పిల్లలకు చేతుల శుభ్రత, మంచి ఆహార అలవాట్లు తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు. ఒక సంవత్సరం నుండి రెండు సంవత్సరాల వారికి సగం మాత్ర పొడిచేసి ఇవ్వాలని, రెండు సంవత్సరములు ఆ పై 19 సంవత్సరముల వారందరికీ ఒక పూర్తి మాత్ర నమిలి మింగించాలన్నారు. భోజనానంతరం వీరందరికీ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రోగ్రాం అధికారులు, ఆర్బీఎస్కే బృందాలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయన్నారు. ఏదైనా కారణంతో 11 వ తేదీన మాత్రలు వేసుకోలేని వారికోసం 18వ తేదీన మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి సిద్ధప్ప, జిల్లా పంచాయతీ అధికారి నాగేంద్రం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ నిషిత, ఐటిఐ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసూన రాణి, డా. రాజు, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియా సకాలంలో అందజేయాలి. - జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియా సకాలంలో అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జమ్ములమ్మ ఆగ్రో ట్రేడర్స్,శివ శంకర్ ఆగ్రో ట్రేడర్స్ ఫర్టిలైజర్స్ , గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు.గోదాంలోని స్టాక్‌ను పరిశీలించారు. ఎరువుల స్టాక్ వివరాలను ప్రతిరోజూ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని, స్టాక్ బోర్డు ప్రకారం కచ్చితంగా నిల్వలు ఉండాలన్నారు. స్టాక్ లెక్కలలో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి రైతు దగ్గర నుంచి ఆధార్ కార్డు వివరాలు సేకరించి ఎరువుల విక్రయాలు జరపాలని ఆదేశించారు.పది బ్యాగులకంటే ఎక్కువ ఎరువులు కొనుగోలు చేయాలనుకునే రైతులు పట్టాదారు పాస్‌బుక్‌ను పరిశీలించిన పెద్దప అందజేయాలన్నారు. స్టాక్ వివరాలను ఖచ్చితంగా రిజిస్ట్రార్‌లో నమోదు చేయాలి, ఎరువుల ధరలు ప్రభుత్వ నియమాల ప్రకారం ఉండాలన్నారు. అన్ని విక్రయాలు ఈ - పాస్ యంత్రం ద్వారా మాత్రమే జరగాలని,లైసెన్స్ లేకుండా ఎరువులు అమ్మకాలు జరగకూడదని స్పష్టంగా ఆదేశించారు.వ్యవసాయ శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, మండల వ్యవసాయాధికారి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా ఘాట్ రోడ్డు పనులు చెపట్టాలి - ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



**చిన్న చింతకుంట మేజర్ న్యూస్ :** మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల శ్రీ కురుమూర్తి స్వామి కొండపైకి ఘాట్ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భక్తులు సులభంగా స్వామివారిని దర్శించుకునేందుకు కొండపైకి రోడ్డు మార్గానికి రూ.110 కోట్లు మంజూరు కాగా అట్టి పనులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి పరిశీలించారు.వేగవంతంగా ఎలివినేటెడ్ కారిడార్ పనులను చేపట్టాలని కాంట్రాక్టర్, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.ఈ బ్రహ్మోత్సవాలకు ఘాట్ రోడ్డు పనులు సగం పూర్తి కావాలని ఆ దిశగా పనులను ముమ్మరంగా కొనసాగించాలని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కథలప్ప, రెండో చైర్మన్ సురేందర్ రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పెబ్బేరులో ప్రెస్ క్లబ్ పనులను పరిశీలన

### టి యు డబల్ జే.రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్



**పెబ్బేర్ మెజర్ న్యూస్ :** పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలో నిర్మిస్తున్న నూతన ప్రెస్ క్లబ్ భవన నిర్మాణ పనులను టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను నాణ్యతగా ఉండేటట్లు పనులు చేపట్టాలని అన్నారు ప్రెస్ క్లబ్ భవనానికి నిర్మాణ నిధులను ఇంకా నిధులు కేటాయించి తొందరగా ప్రెస్ క్లబ్ భవనాన్ని పూర్తి చేయాలని అన్నారు ఎమ్మెల్యే మెగా రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు అదేవిధంగా జిల్లాలోని అన్ని మండలాలలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి కృషి చేయాలని ఆయన కోరారు కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు మాధవరావు, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి మన్యం, జాతీయ కౌన్సిల్ నెంబర్ శ్రీనివాసులు, రాము, నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బాల్ రాజు, ఉపాధ్యక్షుడు. సూర్యవంశం పరుశరాముడు. అతీఖ్ పాషా, నాగరాములు, బలపాల రమేష్, వెంకటేశ్వర గౌడ్, బాలరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక
సూర్య లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్‌నగర్ జిల్లా : హన్వాడ, భూత్పూర్, మూసాపేట, కౌకుంట్ల,
నారాయణపేట జిల్లా :
కోస్గి, కోస్గి రూరల్

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757